దక్షిణ, పశ్చిమ మండల అదనపు డీసీపీగా ఇక్బాల్‌సిద్ధిఖీ

మెహిదీపట్నం, జనవరి7: ప్రజలకు శాంతి భద్రతలను అందించడానికి కృషి చేస్తానని దక్షిణ, పశ్చిమ మండల అదనపు డీసీపీ ఇక్బాల్ సిద్ధిఖీ అన్నారు. మంగళవారం ఆయన పదవీ బాధ్యతలను చేపట్టారు. గతంలో కూడా ఆయన ఇక్కడ పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులను సమన్వయం చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూస్తానని అన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. మంగళవారం టోలిచౌకి ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారుడు సమీసయ్యద్ ఆసిఫ్ అహ్మద్‌కు మంజూరైన రూ.2 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్వోసీని ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అందించారు.

– మెహిదీపట్నం

సన్మానం

కార్వాన్, జనవరి7 : ధూల్‌పేట లోని మినీ స్టేడియంలో నిర్వహించిన కుస్తీ పోటీలలో యువ కుస్తీ వీరులు తమ సత్తా చాటారు. ఈ క్రమంలో తాళ్లగడ్డ రాజ లింగయ్య కబడ్డీ స్టేడియం లోని శ్రీరామ్ వ్యాయామశాలకు చెందిన డి. అర్వింద్ 55–60 కేజీల విభాగంలో వీర్ బజరంగ్ కుస్తీ బాలకేసరీ టైటిల్‌ను తన ప్రత్యర్థి ధన్‌రాజ్‌పై గెలుపొంది సొంతం చేసుకున్నాడు. అర్వింద్‌ను నిర్వాహకులు గధ, పూలమాలతో సన్మానించి సర్టిఫికెట్, బహుమతులు ప్రదానం చేశారు.

అజంతా రైల్లో దొంగతనం..

కాచిగూడ, జనవరి 7: అజంతా రైల్లో ప్రయాణికుని బంగారు ఉంగరం, నగదును దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. నిజాంపేట ప్రాంతానికి చెందిన ఆచార్యులు. అజంతారైల్లో కాచిగూడకు వస్తుండగా బాసర రైల్వేస్టేషన్ సమీపంలో బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. అందులో బంగారు ఉంగరం, ఖరీదైన ఫోన్ ఉన్నట్లు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే సీఐ తెలిపారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు షురూ..

శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న తిరువెంగళాచార్యులు, కార్పొరేటర్లు బోయిని దర్శన్, శంకర్‌యాదవ్, బీఆర్ఎస్ కార్వాన్ ఇన్‌చార్జి జీవన్‌సింగ్ తదితరులు

● శ్రీ రంగనాథస్వామి ఆలయంలో ఉదయం 5 నుంచి ఉత్తర ద్వార దర్శనం

కార్వాన్, జనవరి 7 : శ్రీ రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహించే వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నామని దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ శృంగారం తిరువెంగళా చార్యులు, ఆలయ ప్రతినిధి శృంగారం శేషాచార్యులు, శ్రీనివాస రంగనాథాచార్యులు తెలిపారు. మంగళవారం జియాగూడ శ్రీ రంగనాథస్వామి ఆలయంలో డివిజన్ కార్పొరేటర్ బోయిని దర్శన్, బేగం బజార్ కార్పొరేటర్, బీజేపీ జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ జి. శంర్‌యాదవ్, మంగళహాట్ కార్పొరేటర్ లాల్ సింగ్, బీఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఠాకూర్ జీవన్‌సింగ్, మాజీ కార్పొరేటర్లు పరమేశ్వరి సింగ్, ముఖేష్‌సింగ్, అల పురుషోత్తం, కుల్సుంపురా డివిజన్ ఎసీపీ మునావర్, ఇన్‌స్పెక్టర్ సునీల్, వివిధ ప్రభుత్వ శాఖలైన ట్రాఫిక్, ఆర్ అండ్ బీ, విద్యుత్, జలమండలి అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. జియాగూడ శ్రీ రంగనాథస్వామి దేవస్థానంలో ఈ నెల 10 వ తేదిన వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్సవాలకు నగరంలోని అనేక ప్రాంతాల నుంచే కాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు వస్తారని అందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. ఆర్ అండ్ బీ అధికారుల పర్యవేక్షణలో బారీకేడ్లు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని అన్నారు.

350 మంది పోలీసులతో బందోబస్తు..

అనంతరం కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ...వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు భక్తుల రద్దీ దృష్ట్యా ప్రతి సంవత్సరం మాదిరిగానే 350 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ ప్రతినిధి శృంగారం శేషాచార్యులు మాట్లాడుతూ...వైకుంఠ ఏకాదశి రోజు తెల్లవారుజామున 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని అన్నారు. ఐదు రోజులు పాటు భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు బద్రీనాథాచార్యులు, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు జె. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంగం రామాలయం వద్ద ..

మెహిదీపట్నం : వైకుంఠ ఏకాదశి కోసం లంగర్‌హౌస్ సంగం రామాలయంలో ఏర్పాట్లు షురూ అయ్యాయి. మంగళవారం సంగం రామాలయం రాంలీలా మైదానంలో అక్రమంగా పార్కింగ్ చేసిన కార్లను తొలగించారు. అంతే కాకుండా ట్రాఫిక్ పోలీసులు నో పార్కింగ్ బోర్డును ఏర్పాటు చేశారు. రాంలీలా మైదానంలో ఉన్న చెత్త చెదారం తొలగించారు.

రాంలీలా మైదానంలో ఏర్పాటు చేసిన నోపార్కింగ్ బోర్డు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి'

అంబర్‌పేట తాసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

గోల్నాక, జనవరి 7 : కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు డిమాండ్ చేశారు. మంగళవారం అంబర్‌పేట ఓబీసీ మోర్చా ఇన్‌చార్జి అచ్చిని రమేశ్ ఆధ్వర్యంలో అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయం ముందు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ తో కలసి ఆయన పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ వీరాబాయికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాయాదవ్, బీజేపీ నాయకులు కన్నె రమేశ్‌యాదవ్, స్వామిగౌడ్, ఏడెల్లి అజయ్‌కుమార్, జి.మల్లేశ్, నాగభూషణంచారి, యశ్వంత్, శ్యామ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్‌లో ఉన్న గోల్కొండ తాసీల్దార్ కార్యాలయం వద్ద బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తాసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉదయ్ కుమార్, ఇంద్రసేనారెడ్డి, ఉమారాణి, దేవర వంశి, నాగేంద్రప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, జనవరి 7

అంగన్‌వాడి పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి

అంగన్‌వాడి కేంద్రాన్ని తనిఖీచేస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట, జనవరి 7 : విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు చుడాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి అన్నారు. బాగ్ అంబర్‌పేట తురబ్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్న అంగన్‌వాడి కేంద్రాన్ని మంగళవారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అంగన్‌వాడి కేంద్రంలోని భోజన, తదితర సౌకర్యాలను స్వయంగా విద్యార్థులనుఅడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడి పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలని ఆమె అన్నారు. ఇందులో చదువుతున్న విదార్థులకు ఎలాంటిలోటు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు.

నేడు తుల్జాభవన్‌లో అయ్యప్పస్వామి మహా పడిపూజ

కాచిగూడ, జనవరి 7: శ్రీ జవంతీశ్వరన్ అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు కేజీఎన్‌సీ బోసు గురుస్వామి ఆధ్వర్యంలో నేడు కాచిగూడ తుల్జాభవన్‌లో శ్రీ అయ్యప్పస్వామి మహా పడిపూజ, ఇరుముడి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు లక్కాకుల ప్రవీణ్‌కుమార్ గురుస్వామి, పీసీ ప్రదీప్‌నాయుడు గురుస్వామి, కేవీ యాదగిరి గురుస్వామి తెలిపారు. ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ హాజరు కానున్నట్లు తెలిపారు.

డాక్టర్ పరిమళా సోమేశ్వర్ గొప్ప రచయిత్రి

డాక్టర్ పరిమళాసోమేశ్వర్ సంస్మరణ సభలో పాల్గొన్న సాహితీవేత్తలు

తెలుగు యూనివర్సిటీ, జనవరి 7 : లేఖిని రచయిత్రుల వేదిక ఆధ్వర్యంలో సుల్తాన్‌బజార్‌లో గల శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ఆడిటోరియంలో డాక్టర్ పరిమళా సోమేశ్వర్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత్రి గంటి భానుమతి, డాక్టర్ దేవేందర్ మారోజు పాల్గొని పరిమళా సోమేశ్వర్ రచనలపై ప్రసంగించారు. పరిమళా రచనలల్లో మహిళాభ్యుదయం, మానసిక విశ్లేషణ, పాత్రల సృష్టి అద్భుతమని శ్లాఘించారు. స్త్రీ మానసిక, కుటుంబ, సాంఘిక, రాజకీయ అస్తిత్వ వాదనలు ఆమె రచనలలో వినిపిస్తాయని కొనియాడి గొప్ప రచయిత్రి అని అభివర్ణించారు. పరిమళా సోమేశ్వర్ కుమారుడు డాక్టర్ మనోజ్ పాల్గొని ఆమె సాహితీప్రయాణం, నేర్పిన క్రమశిక్షణ, తీర్చిదిద్దిన వైనాన్ని వివరిస్తూ ఉద్వేగానికి గురయ్యారు. లేఖిని అధ్యక్షురాలు అత్తలూరి విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో కార్యదర్శులు చెంగల్వల కామేశ్వరి, ఉమా కల్వకోట, నళిని ఎర్రా, సర్వ మంగళగౌరి పాల్గొన్నారు.

సైఫాబాద్‌లో ముగ్గుల పోటీలు

విద్యార్థులు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శైలజ

సుల్తాన్‌బజార్, జనవరి 7 : విద్యార్థినులు ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందని సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ శైలజ అన్నారు. మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కళాశాలలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె ముగ్గులను పరిశీలించి విద్యార్థినులను అభినందించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, డాక్టర్ రమ, డాక్టర్ మీనాక్షి, డాక్టర్ మంజరి, డాక్టర్ అరవింద్, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ పల్లాటి నరేశ్‌తో పాటు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాపూ ఘాట్ శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు ప్రారంభం



బాపూఘాట్ శ్మశాన వాటికలో అదనంగా రెండు దహన గద్దెల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అధికారులు, నాయకులు

మెహిదీపట్నం, జనవరి 7 : కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ బాపూఘాట్ శ్మశాన వాటికలో అదనంగా రెండు దహన గద్దెల నిర్మాణానికి మంగళవారం అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ పనులను మాజీ కార్పొరేటర్ రవియాదవ్, ఎంఐఎం నాయకుడు ఉజ్జమాసిద్దిఖీ ప్రారంభించారు. ఈ సందర్భంగా రవియాదవ్ మాట్లాడుతూ.. కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ సహకారంతో ఎంతో కృషి చేశామని, శ్మశాన వాటికలో ప్రజల వద్ద చందాలు చేసి అభివృద్ధి చేశామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని రవియాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు శివశంకర్, మాతంగి రమేశ్, లక్ష్మీనారాయణమ్మ, సునంద, శారద తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌బాబా మందిర్‌లో ఉచిత వైద్యశిబిరం

కాచిగూడ, జనవరి 7: శ్యామ్‌మందిర్ సేవా సమితి ఆధ్వర్యంలో కాచిగూడ శ్రీ శ్యామ్‌బాబా మందిర్ ప్రాంగణంలో శ్రద్ధ కేడియా ఫిజియోథెరిపీ ఆధ్వర్యంలో ఆధునిక పరికరాలతో కీళ్ల నొప్పులు, పక్షవాతానికి సంబంధించిన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు హ్యూమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండా శ్రీనివాస్‌రావు తెలిపారు. అనుభవజ్ఞులైన డాక్టర్ల పర్యవేక్షణలో కీళ్లు, మోకళ్ల నొప్పులు, నరాలు, నడుము, మెడ, లావు, పొట్ట తగ్గడానికి నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరంలో రోగులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 వరకు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9949238492లో సంప్రదించవచ్చును.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మెహిదీపట్నం, జనవరి 7: విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని 11 కేవీ లంగర్‌హౌస్ ఓవర్‌హెడ్ ఫీడర్, 11 కేవీ లంగర్‌హౌస్ కేబుల్ ఫీడర్, 11 కేవీ నేతాజీనగర్ ఫీడర్, 11 కేవీ డిఫెన్స్ కాలనీ ఫీడర్ ప్రాంతాలలో బుధవారం విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఓ ప్రకటనలో తెలిపారు.

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

రాజీవ్ గాంధీనగర్, డిఫెన్స్ కాలనీ, బాపూనగర్, మెహిదీ కాలనీ, జితేందర్ ఫ్లోర్‌మిల్, లంగర్‌హౌస్ రింగ్‌రోడ్, వినాయకనగర్, హరిదాస్‌పురా, అలంకార్ థియేటర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

నేతాజీ నగర్, శ్రీనివాస్‌నగర్, జ్యోతి నగర్, సర్దార్‌బాగ్, మోఘల్‌కా నాలా, కేంద్రీయ విద్యాలయస్కూల్, హాశంనగర్, మందులబస్తీ, డిఫెన్స్‌కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

యువ కళాకారుల నర్తన అద్భుతం

కళాకారులు ప్రదర్శిస్తున్న హరవిలాసంలో ఓ సన్నివేశం

తెలుగు యూనివర్సిటీ, జనవరి 4 : అభినయ వాణి నృత్యానికేతన్ ఆధ్వర్యంలో ప్రముఖ నాట్యాచారుడు డాక్టర్ వెంపటి చినసత్యం నృత్య నాటకాలలో భాగంగా మంగళవారం సాయంత్రం భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో వెంపటి నాట్యమేధ శీర్షికన నిర్వహించిన నట్యోత్సవం ఘనంగా జరిగింది. ప్రముఖ నృత్య గురువు చావలి బాలత్రిపురసుందరి దర్శకత్వంలో హరవిలాసం నృత్య రూపకాన్ని కళాకారులు శివాని, సౌమ్య, వైష్ణవి, అజయ్ అద్భుతంగా నర్తించి ఆహూతులలో భక్తిభావాన్ని పెంపొందించారు. హరవిలాసం, దక్ష యజ్ఞం, పార్వతి కల్యాణం భాగాలుగా వేదికపై ప్రదర్శించి నాట్య ప్రియుల కరతాళధ్వనులందుకున్నారు. ప్రముఖ గురువు మంజు భార్గవి, ప్రొఫెసర్ తడకమళ్ల అనూరాధ పాల్గొని కళాకారులను అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అంబర్‌పేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. డివిజన్‌లోని బాపునగర్‌లో డ్రైనేజీ మ్యాన్‌హోల్ కుంగిపోయి మురుగు నీటితో ఇబ్బందులు పడుతున్నామని స్థానికుల ఫిర్యాదు మేరకు ఆయన మంగళవారం సమస్యను పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని తెలిపారు.

– గోల్నాక, జనవరి 7

సావిత్రబాయిపూలేకు భారతరత్న ఇవ్వాలి

అభివాదం చేస్తున్న వక్తలు ప్రొఫెసర్ ఎం.బాగయ్య, పరమేశ్వరిగౌడ్

రవీంద్రభారతి, జనవరి 7 : మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రబాయిపూలేకు భారత రత్న ఇచ్చి గౌరవించాలని రిటైర్డ్స్ ప్రొఫెసర్ ఎం.బాగయ్య అన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సావిత్రబాయిపూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సావిత్రబాయి 194వ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పూలే జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడాన్ని ఆయన స్వాగతించారు. సావిత్రబాయిపూలేకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వెనుకబడిన వర్గాల మహిళలకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సావిత్రిబాయిపూలే ఫౌండేషన్ సీఈవో పరమేశ్వరిగౌడ్, మీనుగగోపీ, అలివేలు, జానకిరెడ్డి, మందబోయిన నర్సయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సమస్యలపై పోరాటం చేస్తాం

మాట్లాడుతున్న జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి తదితరులు

కాచిగూడ, జనవరి 7 : బీసీల సమస్యలు పరిష్కరించకుంటే కేంద్ర ప్రభుత్వంపై సమరశీల పోరాటం చేస్తామని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి హెచ్చరించారు. మంగళవారం కాచిగూడలో బీసీ, కుల సంఘాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కుమారస్వామి హాజరై పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి, కులగణన చేసే విధంగా బీజేపీ మంత్రులు, నాయకులందరు ప్రధానిపై ఒత్తిడి తేవాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీదళ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను కొనసాగించాలి

జీహెచ్ఎంసీ డీసీ మారుతి దివాకర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నల్లకుంట కార్పొరేటర్ అమృత తదితరులు

అంబర్‌పేట, జనవరి 7 : ప్రస్తుం జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను మరి కొన్ని రోజుల పాటు కొనసాగించాలని, ప్రజాపాలనలో అప్డేట్ కాని వారికి సర్వే నిర్వహించాలని కోరుతూ మంగళవారం నల్లకుంట కార్పొరేటర్ అమృత జీహెచ్ ఎంసీ డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అదే విధంగా నల్లకుంట డివిజన్‌లోని పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ డీసీని కోరారు.

హక్కుల సాధనకు ఐకమత్యంతో ముందుకు సాగాలి

తెలుగు యూనివర్సిటీ, జనవరి 7: నాయీ బ్రాహ్మణులు ఐకమత్యంతోనే హక్కులు సాధించుకోవచ్చని ట్రాన్స్‌పోర్టు అడిషనల్ కమిషనర్ సీఎల్ఎన్ గాంధీ అన్నారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి నాయీ బ్రాహ్మణ సంఘం రూపొందించిన 2025–నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ సభ అబిడ్స్ తిలక్ రోడ్డులోని తెలంగాణ సారస్వత పరిషత్తులో మంగళవారం జరిగింది. ఇందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ నాగరాజు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ పదవిని ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. 50 ఏండ్లు దాటిన వారికి పింఛన్ సౌకర్యం కలిపించాలని కోరారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త ఎల్.రాంబాబు, సంఘం సలహాదారు ఏ మూల సుధాకర్, ప్రధాన కార్యదర్శి కె.యాదగిరి, ఉపాధ్యక్షులు కె.ఈశ్వర్, కె.శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు ఎం.రామచందర్, కె.హరినాథ్, ఏ.జయప్రభు, ఎస్.లక్ష్మీనారాయణ, చౌటకూర నగేశ్, ఎం.గురప్ప, ఎస్.భూపాల్ రాజ్, తొలి చుక్క మాధవి శ్యాంకుమార్ పాల్గొన్నారు.

క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయి

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న ఓయూ రిజిస్ట్రార్ నరేశ్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 7: క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయని ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి అన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జార్జిరెడ్డి జయంతి స్మృతిలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జార్జిరెడ్డి లాంటి విద్యార్థి మేధావుల జీవితాలను నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం హెడ్ ప్రొఫెసర్ రాజేశ్, విద్యార్థి నాయకులు ఎస్. నాగేశ్వర్‌రావు, సుమంత్, వెంకటేశ్, అంజి, కోటేశ్వర్, ధనుష్, క్రాంతి, రంజిత్, నూతన్, బాలకృష్ణ, సాగర్, ప్రతాప్, భాను, మారుతి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.